నేడు, రేపు కిరణ స్పర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో శని, ఆదివారాలు సూర్యోదయం సమయాన నేరుగా కిరణ స్పర్శ జరగనుంది. లేలేత కిరణాలు నేరుగా గర్భ గుడిలోకి ప్రవేశించి స్వామివారి మూల విరాట్‌ను తాకనున్నాయి. ఈ దృశ్యాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో యాత్రికులు హాజరవుతారని, వారి కోసం ప్రత్యేక క్యూలైన్లను రూపొందించామని ఆలయ ఇఒ రమేష్‌బాబు తెలిపారు.

అరసవల్లి సందర్శన

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ జనరల్ పోలీస్ (ఆపరేషన్స్) (గ్రేహౌండ్స్, ఆక్టోపస్ ఆర్.కె.మీనా శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి అనివేటి మండపంలో శేష వస్త్రాలను కప్పి చిత్రపటాన్ని అందజేశారు.

సరుబుజ్జిలి మండలం శ్యామలాపురం సమీపంలో వంశధార కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

మేలుకుంటేనే శివారుకు సాగునీరు

- 'వంశధార'లో గుర్రపుడెక్కే అసలు సమస్య
- ఏటా ఆలస్యంగా పనులు
- త్వరగా చేపట్టాలని డిమాండ్ చేస్తున్న రైతులు

జిల్లాలో వంశధార నీరే ప్రధాన నీటి వనరుగా ఉంది. కుడి, ఎడమ కాలువల కింద వేలాది ఎకరాల్లో ఆయుకట్టు సాగవుతోంది. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 40 ఏళ్ల కిందట నిర్మించిన కాలువ గట్లు బలహీనంగా మారాయి. దీంతో వాటిని ఆధునికీకరణ చేపట్టాల్సి ఉందని అధికారులు ప్రభుత్వానికి పలుమార్లు ప్రాతిపాదనలు పంపినా స్పందన కనిపించడం లేదు. మరోవైపు కాలువల్లో విపరీతంగా పేరుకుపోయినా గుర్రపుడెక్క సాగునీటి ప్రవాహానికి ప్రతిబంధకంగా మారింది. కనీసం పూడికతీత, గుర్రపుడెక్క తొలగించినా కాలువల్లో నీటి ప్రవాహం స్వేచ్ఛగా పారుతుంది. ఏటా ఈ పనులను ఆలస్యంగా మొదలు పెట్టడం, వర్షాలు పడటంతో ఆపేయడంతో పూర్తిస్థాయిలో పనులు చేయడం సాధ్యపడటం లేదు. వేసవి సీజన్ నేపథ్యంలో ఇప్పుడే ఆ ప్రక్రియ మొదలు పెడితే రైతులకు కొంతవరకైనా మేలు కలుగుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడికాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందివ్వాల్సి ఉంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండటంతో నిర్దేశించిన ఆయకట్టుకు నీరందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు నీరందని పరిస్థితి ఏటా పునరావృతమవుతోంది. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండటం, కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెకులు కాగా, కాలువ గట్లు బలహీనంగా ఉండటంతో 1600 క్యూసెకులకు మించి నీరు విడిచి పెట్టలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెకులు కాగా, 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది.

సొంత ఖర్చులతో గుర్రపుడెక్క తొలగింపు

పంట కాలువల్లో గుర్రపుడెక్క, పూడికతీత ఎక్కువ పేరుకుపోతుండటంతో పొలాలకు నీరు ఇబ్బందులు పడటం ఏటా పునరావృతమవుతూనే ఉంది. పనులు ఆలస్యంగా మొదలు పెడుతుండటం, సరిపోయినంత నిధులు విడుదల చేయకపోవడంతో కొన్నిచోట్ల రైతులే తమ సొంత డబ్బులతో కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగించుకున్నారు. గతేడాది జూలై 29న పొలాకి గ్రామానికి చెందిన పది మంది రైతులు వంశధార కాలువల్లోకి దిగి గుర్రపుడెక్క, పూడిక తొలగించాలని దిగారు. కాలువల్లో నీరు ఉధృతంగా ప్రవహించడంతో ముప్పిడి శాంతారావు మృతి చెందాడు.

జిల్లా నిధుల నుంచే గుర్రపుడెక్క తొలగింపు పనులు

కాలువల్లో పెద్ద ఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడంతో నీరు సాఫీగా ప్రవహించని పరిస్థితి ఏటా తలెత్తుతోంది. ప్రభుత్వానికి నిధులు అడుగుతున్నా విడుదల చేయకపోవడంతో జిల్లా అధికారులు వివిధ రకాల ఫండ్స్ నుంచి అత్యవసరంగా నిధులు మంజూరు చేస్తున్నారు. గుర్రపుడెక్క తొలగింపునకు గతేడాది జూలైలో రూ.40 లక్షలు ఇచ్చారు. 2022 జూలైలో రూ.44 లక్షలు, ఆగస్టులో 19.5 లక్షలు కేటాయించారు. 2021లో రూ.15 లక్షలు విడుదల చేశారు. ఈ సంవత్సరం కూడా నిధులు కేటాయించి పనులు వేగంగా పూర్తి చేయగలిగితే రాబోవు ఖరీఫ్ రైతుల కష్టాలు తీరనున్నాయి.

సాగునీందక వరి ఎండిపోయింది

వంశధార ఎడమ కాలువ ఆయకట్టు కింద మా భూములు ఉన్నాయి. ఖరీఫ్‌లో నాలుగు ఎకరాల్లో వరి వేశాను. కాలువలో తుప్పలు, పిచ్చిమొక్కలు ఉండటంతో మా భూముల వరకు నీరు రాలేదు. సాగునీరు రాక, వర్షాలు లేక వరి పంట పూర్తి ఎండిపోయింది. ప్రభుత్వం ఈ సారైనా కాలువలను బాగుచేయించి శివారు భూములకు నీరందించాలని కోరుతున్నాం.

– పి.ధర్మారావు, కొల్లిపాడు, వజ్రపుకొత్తూరు మండలం

కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం

వంశధార కాలువల నిర్వహణలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రాజెక్టు నిర్మించిన తర్వాత ఇప్పటివరకు ఆధునికీకరణ చేపట్టలేదు. దీంతో కాలువల నిర్వహణ సరిగా లేదు. ఎక్కడికక్కడే గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోయింది. వర్షాలు ప్రారంభమైన తర్వాత హడావుడిగా పనులు చేసేసి బిల్లులు చేయించుకుంటున్నారు. శివారు భూములకు సాగునీరు మాత్రం అందడం లేదు. మార్చిలోనే పనులు మొదలు పెడితే ఖరీఫ్ సీజన్ నాటికైనా నీళ్లందుతాయి.

– కె.మోహనరావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

మాట్లాడుతున్న తేజేశ్వరరావు

'చలో ఢిల్లీ'కి మద్దతుగా 14న నిరసనలు

పిలుపునిచ్చిన రైతు, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఈ నెల 14న రైతు సంఘాలు ఇచ్చిన చలో ఢిల్లీకి మద్దతుగా జిల్లా, మండల కేంద్రాల్లో నిరసనలు ప్రదర్శనలు, సభలు నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని రైతు, కార్మిక, ప్రజా సంఘాలు నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని తిలక్ నగర్‌లోని అప్పారి వెంకట్రావు భవనంలో శుక్రవారం రైతు, కార్మిక, ప్రజా సంఘాల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘాల నాయకులు మాట్లాడుతూ 540 రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా ఈ నెల 14న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభ ద్వారా దేశంలో 70 శాతం పైగా ఉన్న రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి గొంతెత్తి నినదించాలని పిలుపు నిచ్చారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం 2021 డిసెంబరులో రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఢిల్లీ బయలు దేరిన రైతాంగాన్ని హర్యానా సరిహద్దుల్లో అడ్డగించడం అన్యాయమన్నారు. బిజెపి ప్రభుత్వం రైతాంగంపై కర్కశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నాలుగు సార్లు చర్చలు జరిపినా పురోగతి సాధించలేదని తెలిపారు. మంత్రులు ఇతర విషయాలు చర్చిస్తున్నారే తప్ప మద్దతు ధరల చట్టం గురించి మాట్లాడడం లేదన్నారు. రైతులు కోరుతున్న మద్దతు ధరల చట్టం చేస్తే ప్రభుత్వంపై రూ.లక్షల కోట్లు ఆర్థిక భారం పడుతుందని అవాస్తవాలు మాట్లాడుతున్నారన్నారు. ఆర్థిక నిపుణులు ఇది నిజం కాదని చెపుతున్నా పెడ చెవిన పెడుతున్నారని విమర్శించారు. రద్దు చేసిన నల్ల చట్టాల విధానాలనే అమలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎరువులపై రాయితీల్లో కోతలు విధించడం, ఆహారభద్రత చట్టం అమలులో కోత విధించి కార్పొరేట్ కంపెనీలకు మాత్రం రూ.వేల కోట్ల రాయితీలు ఇస్తున్నారన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకూ మద్దతు ధరల చట్టం చేయాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం చేయాలన్నారు. 4 లేబర్ కోడ్లను రద్దు చేసి, కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీకి బడ్జెట్లో రూ. 2 లక్షల కోట్లు కేటాయించి, 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. కూలి రూ.600లు పెంచాలని, రెండో పూట పని, ఆన్‌లైన్ మస్టర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠ పరచాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని అన్నారు. కడప ఉక్కును ప్రభుత్వరంగం లోనే నిర్మించాలన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. భూ హక్కుల చట్టాన్ని ఉపసంహరించాలని, చుక్కల భూములు బంజరు భూములన్నిటికీ పట్టాలు ఇవ్వాలని అన్నారు. కౌలు రైతులకే నష్టపరిహారం, బీమా చెల్లించాలన్నారు. అటవీ హక్కుల చట్టం సవరణలు ఉపసంహరించాలని, ఆదివాసుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వంశధార, బహుదా నదులు అనుసంధానం చేసి ఇచ్ఛాపురం వరకు సాగునీరందించాలని కోరారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు వెంటనే పూర్తి చేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాద్, ఐద్వా జిల్లా కన్వీనర్ బి.లక్ష్మి, నాయకులు శ్రీదేవి పాణిగ్రాహి, శ్రామిక మహిళా జిల్లా కో-కన్వీనర్ ఎ.మహాలక్ష్మి, ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీష్, చందు, పెన్షనర్స్ యూనియన్ నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి సిఐటియు పట్టణ నాయకులు ఆర్.ప్రకాశరావు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు టిడిపి కృషి

జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాట్లాడుతున్న కూన రవికుమార్

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పాలనలోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించారని, టిడిపి ప్రభుత్వం ఏర్పాటుతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మహిళా దినోత్సవం సందర్భంగా 'కలలకు రెక్కలు' అనే సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకువచ్చారని తెలిపారు. రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ ఆర్థిక ఇబ్బందులతో చదువుకు స్వస్తి చెప్పి ఇంటికి పరిమితం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని తీసుకొస్తామని అన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన మహిళలు ఈ పథకానికి దరఖాస్తు చేసేందుకు అర్హులని అన్నారు. మహిళలు ఆర్థిక పరిస్థితుల కారణంగా తమ కలలను రాజీ పడకుండా వారి లక్ష్యానికి చేరుకునే విధంగా ఈ పథకం అడుగులు వేయిస్తుందని తెలిపారు. ఈ పథకానికి నమోదు చేసుకున్న మహిళలు ఉన్నత విద్య కోసం బ్యాంకు రుణం తీసుకుంటే ఆ రుణానికి వడ్డీకి టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని అన్నారు. ఈ పథకం కింద అర్హత ఉన్న మహిళలందరూ దేశంలో ఎక్కడైనా తమకు నచ్చిన ప్రొఫెషనల్ కోర్సులను అభ్యసించవచ్చునని తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన ఏటా రూ.15 వేలు టిడిపి అధికారంలోకి వస్తే ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్‌పర్సన్ కూన వెంకట రాజ్యలక్ష్మి, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు బోయిన సునీత పాల్గొన్నారు.

మహిళా స్వేచ్ఛకు పోరాటాలు అనివార్యం

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పోటో: మాట్లాడుతున్న ప్రభావతి

సామాజిక, ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛ కోసం మహిళలు పోరాటం చేయడమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తిని కొనసాగించడమని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మహిళలు సమస్యలు కర్తవ్యాలు అనే అంశంపై సిఐటియు, యుటిఎఫ్, ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడుతూ సమాజంలో వర్గపోరాటాల నేపథ్యంలో మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేయడం వల్లే అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళల కోర్కెల దినంగా చరిత్రపుటల్లో నిలిచిందన్నారు. శ్రామిక మహిళలపై శ్రమదోపిడీ, లైంగిక దోపిడీ నానాటికి తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో మహిళలు తమ హక్కుల కోసం పనిభారం నుంచి విముక్తి కోసం స్వేచ్ఛ స్వాతంత్రం కోసం ఆర్థిక సామాజిక పోరాటాల బాటపట్టాలని పిలుపునిచ్చారు.

మద్యం, మత్తు పదార్థాలు, గృహహింస మహిళల అభివృద్ధికి అడ్డుకుంటున్నాయని అన్నారు. సమాజంలో సగభాగాన ఉన్న మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నా ఇంకా పురుషుడు చాటు స్త్రీగా కొనసాగాలని మనువాద భావజాలం కోరుతుందని అన్నారు. మహిళలను వంటింటికే పరిమితం చేయాలని ఆలోచనలతో కార్పొరేట్ మీడియా తీవ్ర ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. నిర్భయ, దిశ వంటి చట్టాలు రూపొందించినా మహిళలపై లైంగిక దాడులు ఏ మాత్రం నిర్మూలించలేదు సరి కదా నానాటికీ తీవ్రతరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సదస్సుకు బి.ధనలక్ష్మి అధ్యక్షత వహించగా, శ్రీకాకుళం దిశా పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ కె.రేణుకరాణి, ఐసిసి జిల్లా చైర్మన్ ఎం.వాగ్దేవి, శ్రామిక మహిళా జిల్లా కో-కన్వీనర్ ఎ.మహాలక్ష్మి, ఐద్వా జిల్లా కన్వీనర్ ఎ.లక్ష్మి, డిగ్రీ కాలేజ్ లెక్చరర్ స్వర్ణలత, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందు, హరీష్, పి.పవిత్ర, ఐద్వా నాయకులు పి.శ్రీదేవి, ఎం.లలిత, ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ స్వర్ణలత, ప్రజా సంఘాల నాయకులు జి.గిరిధర్, వి.జి.కె.మూర్తి, పొందూరు అప్పారావు పాల్గొన్నారు.

ఎండల మల్లన్నకు యాత్రికుల తాకిడి

దర్శించుకుంటున్న అచ్చెన్నాయుడు

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలస ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయానికి మహాశివరాత్రి సందర్భంగా యాత్రికులతో కిటకిటలాడింది. జిల్లా నుంచే కాక, ఒడిశా రాష్ట్రం నుంచి కూడా యాత్రికులు వేకువజాము నుంచే దర్శించుకున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. కానీ, వృద్ధులకు, వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయకపోవడంతో పలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, సర్పంచ్ సర్లాన బాలకృష్ణ పాల్గొన్నారు. అలాగే టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబ సమేతంగా, దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆలయాన్ని సందర్శించారు. వీరికి ఆలయ ఇఒ వాకచర్ల రాధాకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.సుధాకర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈయనతో పాటు డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ ఉన్నారు.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

పలాస : కాశీబుగ్గ అటవీశాఖ రేంజ్ పరిధిలో విదేశీ వన్య ప్రాణులను తరలిస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర ముఠా స్మగ్లర్లను ఇచ్ఛాపురంలోని పురుషోత్తపురం చెక్‌పోస్టు దగ్గర పట్టుకుని అరెస్టు చేశామని కాశీబుగ్గ అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ ఎ.మురళీకృష్ణ నాయుడు తెలిపారు. ఈ మేరకు కాశీబుగ్గలో ఆయన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. అస్సాంలోని కోతుల బ్రీడ్ సెంటర్ నుంచి రెండు కోతులను కొనుగోలు చేసిన కేరళ వాసి పశ్చిమ బెంగాల్‌కు చెందిన సౌరభ్ ముండల్, ధనుంజయ సింగ్ ముఖేష్ రామ్‌లతో ఆన్‌లైన్‌లో వెహికల్ బుక్ చేసుకున్నారని రేంజర్ తెలిపారు. వారితో తమిళనాడు రాజధాని చెన్నైకు కోతులను చేర్చేలా కిరాయికి బేరం కుదుర్చుకున్నారని చెప్పారు. కారులో సౌత్ ఆఫ్రికాలోని ఉగాండా పర్వత శ్రేణుల్లో సంచరించే అటవీ జాతి సంతతికి చెందిన రెండు అరుదైన సన్ టైల్డ్ మంకీ, మౌంటైన్ మంకీ, (ఎల్ హోస్టు) ఆడ, మగ మంకీలను స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశామన్నారు. వన్య ప్రాణుల సంరక్షణ యాక్టు కింద పశ్చిమబెంగాల్‌కు చెందిన సౌరభ్ ముండల్, ధనుంజయ సింగ్ ముఖేష్ రామ్ అనే ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి ఇచ్ఛాపురం మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచామని చెప్పారు. జడ్జి వారికి 14 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు.

అరెస్టు అయిన స్మగ్లర్లు

సహాయక చర్యలు చేపడుతున్న ఎస్‌పి రాధిక

రెండు లారీలు ఢీ

- నరసన్నపేట మండలం సత్యవరం వద్ద ప్రమాదం
- స్వయంగా సహాయక చర్యలు చేపట్టిన ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట మండలం సత్యవరం కూడలి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న రెండు లారీలు ఢీకొన్నాయి. డ్రైవర్, క్లీనర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో ఓ లారీ క్యాబిన్‌లో డ్రైవర్, క్లీనరు ఇరుక్కుపోయారు. అదే సమయంలో శ్రీముఖలింగం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న జిల్లా ఎస్‌పి జి.ఆర్.రాధిక వెంటనే తన వాహనాన్ని ఆపి ప్రమాద స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని గమనించి స్వయంగా సహాయక చర్యలను చేపట్టారు. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన వారికి అధైర్యపడవద్దని సూచించారు. లారీలో చిక్కుకున్న వారిని బయటకు తీసేలా సిబ్బందికి సూచనలు సలహాలు అందజేశారు. గాయాల పాలైన వారిని చికిత్స కోసం శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రికి అంబులెన్స్‌లో తరలించేలా చర్యలు చేపట్టారు. ఎస్‌పి రాధిక స్వయంగా సహాయక చర్యల్లో పాల్గొనడంపై అక్కడకు చేరుకున్న స్థానికులు ఆమె సహాయక చర్యలను అభినందించారు. ఎస్‌పి తీసుకున్న చొరవపై ప్రశంసలు కురిపించారు. ప్రమాద ఘటనపై నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన డ్రైవర్ అజిత్ ఖాన్, క్లీనర్ సోహిల్‌ఖాన్ రాజస్తాన్ వాసులుగా గుర్తించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లోనూ ప్రమాద సమయంలో ప్రజలు ప్రాణాలు కాపాడటమే పోలీసులు బాధ్యతని ఆపదలో ఉన్న సమయంలో జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు. అదే విధంగా శుక్రవారం జరిగిన ప్రమాద ఘటనని చూసి తోటి వారికి సహాయం పడాలని భావంతో సహాయ చర్యలు అందించామని, ఇది మా బాధ్యతగా భావిస్తున్నానని ఎస్‌పి తెలిపారు.

మహిళలపై వివక్ష పోవాలి

ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మహిళా పోలీసులతో ఎస్‌పి రాధిక

మహిళలపై వివక్ష పోయి సమానత్వం సాధించేందుకు అంతా కృషి చేయాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. నగరంలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యాన శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశిష్ట అతిథులుగా ఎస్‌పితో పాటు నగర కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారీయా, ఎస్‌పి మాతృమూర్తి, జిల్లా జడ్జి సతీమణి పి.షబాణా అజ్మీ, డాక్టర్లు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌పి జి.ఆర్.రాధిక మాట్లాడుతూ ఉద్యోగస్తులైన మహిళలకు ప్రోత్సాహాన్ని అందిస్తే మరిన్ని విజయాలు సాధించడానికి అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రస్తుతం పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అలాంటప్పుడు వ్యక్తిత్వానికి భంగం కలగకుండా ప్రతి మహిళా స్వేచ్ఛగా స్వతంత్రంగా బతకగలిగే ధైర్యాన్ని సంపాదించుకోవాలని అన్నారు. చదువుకున్న పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి తీసుకురావద్దని, చదువుతోపాటు జ్ఞానాన్ని పెంపొందించేలా వారిని సమర్థించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్కువగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని, మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి మహిళా ఫోన్‌లో దిశ యాప్ ఉంటే ఆపద సమయంలో పోలీస్ సహాయ, సహకారాలు పొందగలమని అన్నారు. మార్చి 8 ఒక్క రోజుతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముగిసింది కాదని, రోజూ మహిళా దినోత్సవంగా భావించాలని అన్నారు. ఎంతో మంది త్యాగ ఫలితంగా వచ్చిన మహిళ సమాన హక్కును అందరూ వినియోగించుకోని అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. అనంతరం మహిళలు ఎస్‌పిని దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అలాగే ఎస్‌పి విశిష్ట అతిథులను సన్మానించారు.

'ఉపాధి' కూలీలకు రూ.600 ఇవ్వాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

మహిళా సాధికారతను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, మహిళల కోసం తయారు చేసిన చట్టాలను సైతం అమలు చేయకుండా, రక్షణ లేకుండా చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గంగరాపు ఈశ్వరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గార మండలం సతివాడలో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో శుక్రవారం మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళల హక్కుల కోసం చర్చించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సాధికారత అంటూ ఉపన్యాసాలు చెప్పి గద్దె నెక్కిన పాలకులు అధికారంలోకి రాగానే ఆ మాటను విస్మరిస్తున్నారన్నారు. పోరాడి సాధించుకున్న ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తూ మహిళా కూలీలకు కనీస కూలి అందకుండా చేస్తున్నారన్నారు. గ్రామీణ పేదరికం పెరుగుతోందని, పెరుగుతున్న ధరల ప్రభావంతో చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలతో బతుకు భారమవుతోందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆర్థికంగా కుటుంబాలను ఆదుకునేందుకు ఉపాధి కూలీలకు పూర్తిస్థాయిలో పని కల్పించాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నా... రాష్ట్రంలో సిఎం జగన్మోహనరెడ్డి ప్రశ్నించడం లేదన్నారు. సమావేశంలో సిర్ల మంగమ్మ, పెయ్యల రాజేశ్వరి, కర్రి రాములమ్మ, సింహాద్రి, కుమారి పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సోంపేట.
H.M.O.P. No. 3/2024

Between :కొండా శంకర్రావు --వాది
And: కొండా కొర్లమ్మ --ప్రతివాది

నోటీసు

To,
కొండా కొర్లమ్మ, W/o కొండా శంకర్రావు, వయస్సు 27 సం॥లు, హిందూ, గృహకృత్యములు, R/o దిగ్గువ వీధి, మంచినీళ్ళ పేట గ్రామం, వజ్రపుకొత్తూరు మండలం, శ్రీకాకుళం జిల్లా.

మీపై పైఉదహరించిన వాది సోంపేట సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో వివాహం రద్దు కొరకు దావా వేసియున్నారు. మాకు సమన్లు జారీ చేసినను మీరు తప్పించుకొన్నారు. అందువలన పై కోర్టు వారు మీ యొక్క హాజరు నిమిత్తం పై దావా తేది: **14-03-2024 న ఉదయం గం॥ 10.30. ని॥ లకు** పై కోర్టులో మీ హాజరు నిమిత్తం మీరు ప్రత్యక్షంగానూ, వకీలు ద్వారా గాని హాజరు కాగలరు. లేని యెడల మా పరోక్షమున పై దావా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారు ఉత్తర్వుల మేరకు //

భగవాన్ దాస్
న్యాయవాది,ఇచ్ఛాపురం,
శ్రీకాకుళం జిల్లా, ఫోన్: 9000558017.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

మహిళా ఆర్థిక స్వావలంబన దిశగా పాలన

ప్రజాశక్తి- పోలాకి

మహిళల పేరిట అన్ని సంక్షేమ పథకాలు అందచేసి తద్వారా మహిళా ఆర్థిక స్వావలంబన దిశగా పాలన అందించిన ఘనత సిఎం జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం పోలాకి మండల కేంద్రంలో వైఎస్ఆర్ చేయూత పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికి రూ.18,750 చొప్పున 5,756 మందికి సుమారు రూ.10 కోట్లు ప్రభుత్వం అందించిందన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఎటువంటి అవినీతి జరగకుండా డైరెక్ట్ బెనిఫిషర్స్ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం గొప్ప పరిణామమన్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలతో కలిపి కేకు కట్ చేశారు. సిఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపి అభ్యర్థి పేరాడ తిలక్, జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ దమయంతి, ప్రతినిధి బైరాగి నాయుడు, కణితి కృష్ణారావు, సర్పంచ్ మజ్జి రమణమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

టిడిపి, జనసేనతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తున్న సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తరిమి కొట్టాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. టిడిపి, జనసేన పొత్తు సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ బాబు పట్టణంలో ఉన్న జనసేన కార్యాలయానికి వచ్చి జనసేన, టిడిపి నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఇరుపక్షాలు కలిసి ఈ రాక్షస సంహారం కోసం ఏకమై పోరాడాలన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తన గెలుపు తథ్యమన్నారు. జెడ్‌పి చైర్‌పర్సన్ నియోజకవర్గంలో పర్యటించి హామీలిచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు మాట్లాడుతూ తమ అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉన్నామని, రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీ దిశగా అడుగులు వేస్తామని స్పష్టం చేశారు. ముందుగా అశోక్‌కు సన్మానం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, నందిక జాని, సాలీనా ఢిల్లీ, లీలారాణి, చిరంజీవులు రెడ్డి, దిలీప్ కుమార్, జనసేన నేతలు దుర్యోధన రెడ్డి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న రవికుమార్

'సూపర్ సిక్స్'పై ప్రచారం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సిఎం జగన్మోహన్ రెడ్డి నుంచి రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలం పకీర్‌సాహెబ్‌పేట, అలమాజీపేట, సీతారాంనగర్‌లో శంఖారావంలో భాగంగా బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి రాగానే ప్రజలకు అందించే సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ గత ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి మాయ మాటలు విని అధికారం అప్పచెప్పితే రాష్ట్రానికి అప్పులు, అరాచకాలు, దౌర్జన్యాలు మిగిలాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కిల్లి సిద్ధార్థ, శివ్వాల సూర్యం, అంబల్ల రాంబాబు, లావేటి పూర్ణారావు, పైడి మురళీమోహన్, తాడేల వెంకటరమణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

బాలికలకు చదువే ముద్దు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సమాజంలో బాల బాలికలందరికీ చదువే ముద్దని, తొందర పాటు వివాహాలు వద్దని, వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఏర్పాటు చేసిన బాలల రక్షణ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బాలబాలికలు ఆరోగ్యవంతంగా, స్వేచ్ఛగా చదువుకోవడం, సమాజ హితం కోసం పనిచేయడానికి తల్లిదండ్రులతో పాటు ప్రజా ప్రతినిధులంతా సహకరించాలని కోరారు. బాల్య వివాహాలను నిరోధించే బాధ్యత మండలస్థాయి కమిటీతో పాటు గ్రామస్థాయి కమిటీలపై అవగాహన కల్పించాలన్నారు. మైనర్ బాలికల వివాహాలను అడ్డుకునే బాధ్యత సమాజంలో ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వాసుదేవరావు, ఐ.సి.డి.ఎస్. పిఒ అనురాధ, సూపర్‌వైజర్ లక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి, లీగల్ కో-ఆర్డినేటర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

టిడిపిలోకి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో మెట్టెక్కివలస తదితర ప్రాంతాల్లో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న యువకులు శుక్రవారం టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సమక్షంలో పార్టీ కార్యాలయంలో టిడిపిలో చేరారు. రవికుమార్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ ఏర్పాటుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు తంగి గురయ్య, నాగళ్ల మురళీధర్ పాల్గొన్నారు.

పార్టీలో చేరిన యువకులతో రవికుమార్

మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలి

బూర్జ : మహిళలను సన్మానిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- బూర్జ

మహిళలు అన్ని రంగాల్లోనూ ప్రతిభ చాటాలని శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. మండలం పెద్దపేటలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సామాజిక ప్రగతి సాధ్యమవుతుందన్నారు. మండలంలో ప్రత్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన మహిళలకు, నామినేటెడ్ పదవుల్లో నియామకం పొందిన మహిళలకు, మహిళా ఉద్యోగులకు ఘనంగా సత్కరించారు. రాష్ట్రపతి, గవర్నర్, స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధ పదవుల్లోనూ మహిళలు అద్భుతంగా రాణిస్తూ తమదైన ముద్ర వేసుకుంటు న్నారన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో మహిళలు ఉన్నత స్థాయిల్లో నిలదొక్కు కోవాలన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో వైసిపి సర్కార్ మహిళలకు పెద్ద పీట వేస్తుందన్నారు. సామాజిక సాధికారితే లక్ష్యంగా ఏర్పాటుచేసిన బిసి కార్పొరేషన్లకు చైర్‌పర్సన్‌లుగా, డైరెక్టర్లుగా మహిళలకు ప్రాధాన్యత కల్పించిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు సూర్యారావు, కృష్ణమ నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు నారాయణమూర్తి పాల్గొన్నారు

టెక్కలి రూరల్: సమాజ అభివృద్ధితో పాటు కుటుంబ అభివృద్ధిలో మహిళలు కీలకమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. శుక్రవారం వైసిపి కార్యాలయ ఆవరణలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చింతాడ మంజు, ఎంపిపి ప్రతినిధి రోణంకి ఉమామహేశ్వరరావు, మేరుగ అప్పారావు, సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసిలు కూన పారూ, పీత హేమలత పాల్గొన్నారు.

పలాస: రాష్ట్రంలో స్త్రీలపై హింస పెరిగిపోతుందని, స్త్రీలు అనేక రూపాల్లో హింసకు గురవుతూ చనిపోతున్నారని, ఈ హింసకు వ్యతిరేకంగా మహిళలు ఐక్యంగా పోరాడాలని ఉత్తరాంధ్ర మహిళా సంఘం అధ్యక్షురాలు పి. నాగమణి పిలుపునిచ్చారు. మందస మండలం సువర్ణపురంలో అంతర్జాతీయ శ్రామిక మహిళ పోరాట దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యు.జ్యోతి, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తిరి దానేష్, ప్రజా కళా మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి నీలకంఠం, జిల్లా కార్యదర్శి చిరంజీవిలు పాల్గొన్నారు.

సాయి విద్యామందిర్‌లో...

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని పి.ఎన్.కాలనీలో ఉన్న శ్రీసాయివిద్యా మందిర్‌లో మహిళా దినోత్సవ సందర్భంగా ఎంప్లాయిమెంట్ జిల్లా ఆఫీసర్ కె.సుధారాణి 350 మంది విద్యార్థుల మాతమూర్తులను, 50 మంది మహిళా సిబ్బందికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బూరగాపు లక్ష్మణరావు, సెక్రటరీ లక్ష్మి, మేనేజర్ పి.ఎస్.మహాలక్ష్మి, సీనియర్ ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, తవిటిరాజు, లీడ్ ఆర్గనైజర్ అనూప్‌కుమార్ కో-ఆర్డినేటర్లు ఇందువదన, రాజేశ్వరి చౌదరి, విశ్రాంత ఉపాధ్యాయులు పైడి పాండురంగారావు పాల్గొన్నారు.

విశాఖ స్కూల్లో ...

నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో గల విశాఖ స్కూల్లో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ డాక్టర్ కె.మధుసూదనరావు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

హర్షవల్లి లయన్స్ క్లబ్ ఆధర్యాన...

హర్షవల్లి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం ఆధర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు అధ్యక్షులు కరణం శోభారాణి ఎస్ఐ ప్రవల్లిక, నృత్యదర్శకులు డాక్టర్ నీరజ సుబ్రహ్మణ్యం, సంఘ సేవకురాలు శ్యామలాకుమారిలను సన్మానించారు.

పోలాకి: స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ

శ్రీకాకుళం అర్బన్ : సన్మానిస్తున్న మధుసూదనరావు

శ్రీకాకుళం అర్బన్ : సన్మానిస్తున్న సుధారాణి, తదితరులు

మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థుల తల్లులను సత్కరించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, ప్రభుత్వ మహిళా కళాశాల బోటని అధ్యాపకులు సాధు రుద్రమ రాణి, కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గా ప్రసాద్, కళాశాల సామాజిక కార్యకర్తలు ఉండవల్లి రమాదేవి, స్రవంతి, కళాశాల అధ్యాపకులు మెండ మోహన దాస్, ముకళ్ల శ్రీనివాస్, రమేష్ బాబు, కె.రాము, విద్యార్థినులు పాల్గొన్నారు.

పలాస: మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. మండలంలోని రెంటికోటలో మహిళాదినోత్సవం సందర్భంగా రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని శుక్రవారం రపారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 365 రోజుల్లో ఒక్క రోజు మహిళా దినోత్సవం కావడం తనకు సంతృప్తిగా లేదని, రోజూ నిర్వహించుకోవాలని తాను భవిస్తున్నానని అన్నారు. పురుషులతో సమానంగా రాజకీయంగా, చట్టసభల్లో, క్రీడలు వంటి అన్ని రంగాల్లో సమానంగా చూడాలన్నారు. వైద్య శిబిరం 300 మహిళలకు వైద్యులు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. అలాగే బాలబాలికలు వివిధ సాంస్కృతిక కళలను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పేద మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శాసనపురి తిరుమలరావు, డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి, సిఐ విజయానంద్, ఎస్ఐలు పాల్గొన్నారు.

నగరంలోని బాపూజీ కళామందిర్‌లో న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం నర్సులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బగాది శాంతిశ్రీ, శ్రీకాకుళం ఎస్ఐ మొజ్జాడ ప్రవల్లిక, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ డాక్టర్ టి.మణికంఠ, వాకర్సు ప్రతినిధి శాశపు జోగినాయుడు, లయన్స అరసవల్లి వ్యవస్థాపకులు హారికాప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

యువతులకు తోడుగా 'కలలకు రెక్కలు'

ప్రజాశక్తి- పలాస

మాట్లాడుతున్న శిరీష

మహిళా సాధికారత దిశగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కలలకు రెక్కలు అనే పేరుతో ఓ సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకొచ్చారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎపిలో ఏ ఆడబిడ్డ కూడా చదువుకు సంబంధించి డబ్బుల కొరతతో ఇంటికి పరిమితం కాకూడదనే ఆలోచనతో నూతన పథకాన్ని తీసుకుని వచ్చారని చెప్పారు. మహిళలకు వృత్తిపరమైన విద్యకు మార్గాలను అందించడంతో పాటు వారికి మరింత ఉపాధి అవకాశాలు కల్పించడం పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ఇంటర్మీడియట్ విజయవంతంగా పూర్తి చేసిన మహిళలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఈ పథకం కింద నమోదు చేసుకున్న మహిళలు తీసుకునే బ్యాంక్ రుణానికి టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని చెప్పారు. ఈ పథకం కింద మహిళలు తీసుకునే మొత్తం రుణానికి సంబంధించిన వడ్డీని టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రిజిస్ట్రేషన్ లింక్ పొందడానికి 9261292612కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా లేదా Kalalakurekkalu.com సందర్శించాలని తెలిపారు.

శ్రీకాకుళం అర్బన్ : మహిళలకు స్వయంశక్తి సంఘాలను ఏర్పాటు చేసి పొదుపును అలవాటుగా మార్చింది చంద్రబాబేనని, మహిళా సాధికారత టిడిపి వల్లే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. అరసవల్లిలోని ఆమె స్వగృహంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో మహిళల కోసం కలలకు రెక్కలు పథకాన్ని ప్రవేశపెట్టి అనేక రకాలైన సహకారాన్ని మహిళలకు అందజేస్తామని అన్నారు. అడ పిల్లలు డబ్బు కొరతతో చదువుకు దూరం కాకూడదని ఈ పథకాన్ని చంద్రబాబు రూపొందించారని తెలిపారు.

రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

ముగిసిన రాష్ట్రీయ సురక్ష దివస్

నౌపడ : సంత బొమ్మాలి మండలం మూలపేట పోర్టులో విశ్వసముద్ర కనస్ట్రక్షన్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ సురక్ష దివస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దేశం కోసం సేవలందించే ప్రతి భారతీయునికి మా రక్తపుసిరా అంకితమని డైరెక్టర్ శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ భారతదేశంలో ప్రజల శాంతి భద్రతలను కాపాడుకోవడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న భద్రతా దళాల కృషిని అభినందించడానికి మార్చి 4న జాతీయ భద్రతా దినోత్సవం లేదా రాష్ట్రీయ సురక్ష దివాస్‌గా జరుపుకుంటారన్నారు. దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన వారిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్‌బ్యాంక్ మేనేజర్ డాక్టర్ మణికంఠ, జె.ఎస్ రాజు, దూసి సంతోష్, జైశ్రీరామ్, విశ్వ సముద్ర ఉద్యోగులు పాల్గొన్నారు.

టిడిపితోనే 'రెడ్డిక'ల అభివృద్ధి

ఇచ్ఛాపురం: టిడిపితో రెడ్డికి సామాజిక వర్గానికి సరైన న్యాయం దక్కుతుందని రెడ్డికి సాధికారిత సమితి కన్వీనర్ కొండ శంకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో మాట్లాడారు. రెడ్డికల కోసం మాజీ సిఎం చంద్రబాబు నాయుడు నియోజకవర్గంలో రెడ్డిక రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు, పాడి రైతులకు ఆవులు, మేకలు, గొర్రెలు టిడిపి అధికారంలోకి రాగానే అమలు చేస్తామని హామీ ఇవ్వడంతో చంద్రబాబు నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో సమిష్టి కృషితో టిడిపిని విజయ పథంలో నడిపించాలన్నారు. సమావేశంలో ఆశి జీవులురెడ్డి, దక్కత. ఢిల్లీరావు, బొడ్డా. మణిచంద్ర ప్రకాష్, పిలక చిన్నారెడ్డి, పైల పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయాలతోనే సత్వర సేవలు

ప్రజాశక్తి- బూర్జ

ప్రజలకు అవసరమైన సేవలను అందించేందుకు వీలుగా సచివాలయాలు నెలకొల్పడం జరిగిందని శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం మండలం పెద్దపేటలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. పంచాయతీ పరిధిలో జగన్నాధపురంలో సుమారు రూ.41 లక్షలతో జల జీవన మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కుళాయిలకు శంకుస్థాపన చేపట్టారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం రూ.10 లక్షలతో పనులు పూర్తి చేసిన సిసి రోడ్లు ప్రారంభించారు. కొత్త ఊరులో రూ.60 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచి నీరు కుళాయిలను ప్రారంభించారు. రూ.15 లక్షలతో బొమ్మిక రోడ్డు నుంచి కొత్త ఊరు వరకు నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభించారు. అలాగే ఎపిపేటలో రూ.40 లక్షలతో పనులు పూర్తిచేసిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సేవలు సక్రమంగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేందుకు సచివాలయ వ్యవస్థ ఉపకరిస్తుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఏ రకమైన ప్రభుత్వ ధ్రువపత్రాలైన గ్రామ సచివాలయంలో లభ్యమవు తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు సూర్యారావు, కృష్ణమ నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు నారాయణమూర్తి, మండల పార్టీ కన్వీనర్ వెంకటరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి తప్పదు మూల్యం

నిర్లక్ష్యంగా వేసిన వ్యర్థాలు

ప్రజాశక్తి- కవిటి

కొంతమంది నిర్లక్ష్యానికి చాలామంది మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. పారిశుధ్య నిర్వహణ కోసం గ్రామస్థాయి వరకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నా చాలామంది నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. మేజర్ పంచాయతీలో ప్రతిరోజూ చెత్త సేకరణ బండి తిరుగుతున్నా, పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నా చాలామంది ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, షాపుల వ్యర్థాలు ప్రగడపుట్టుగ జంక్షన్ నుంచి సుమారు అర కిలోమీటర్ మేరకు డంపింగ్ చేస్తున్నారు. దీంతో వాటి నుంచి వస్తున్న దుర్వాసనతో పాదచారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం వేళలో వాకర్స్, తోటలకు వెళ్ళే రైతులు ఆ ప్రాంతంలో ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎవరూ లేని సమయంలో, రాత్రి వేళల్లో హోటళ్లలో మిగిలిన వ్యర్థాలు, కుళ్ళిన కోడిగుడ్లు, మందు బాటిళ్లు, షాపుల్లో మిగిలిన వ్యర్థాలు అక్కడ వేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఉదయం వేళల్లో వాటినుంచి తీవ్రమైన దుర్వాసన వస్తోందని, వీటిద్వారా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వారు భయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీరోజూ మండల కేంద్రంలో చెత్త సేకరణ బండి తిరుగుతున్నా ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని అపరాధ రుసుం వసూలు చేయాలని కోరుతున్నారు.

వైద్య శిబిరాలకు స్పందన

శ్రీకాకుళం అర్బన్ : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రణస్థలం : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికరారి ప్రసన్న లక్ష్మి

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. దీర్ఘకాలిక శ్రద్ధ అవసరమయ్యే రోగులకు ఉచిత పరీక్షలు, సాధారణ ఆరోగ్య అవగాహన, చికిత్సలు అందించారు. సుమారు 300 మంది రిజిస్టేషన్ చేసుకుని వైద్య సహాయం పొందారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం వరకు శిబిరం కొనసాగింది. వైద్య శిబిరంలో ఆయుష్ వైద్యాధికారిణి డాక్టర్ ప్రసన్న లక్ష్మి బృందంతో కలిసి పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా ఆర్థరైటిస్, గైనిక్ కేసులు, ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులు, చర్మ వ్యాధులు, వృద్ధాప్య వ్యాధులు వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగుల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ శిబిరంలో కాంపౌండర్ జె.రమణ, అటెండర్ బివి రమణ తదితరులున్నారు.

బూర్జ: ఆయుష్ ఆధ్వర్యంలో స్థానిక శివాలయం వద్ద శుక్రవారం ఆయుర్వేద శిబిరాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యాధికారిని ఎస్.మంగమ్మ రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. కార్యక్రమంలో ఎస్.సుబ్బారావు, జి.వంశీ తదితరులున్నారు.

శ్రీకాకుళం అర్బన్: మహాశివ రాత్రి సందర్భంగా ఆయుష్ శాఖ, ఆధ్వర్యాన నగరంలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో జిల్లా ఆయుష్ విభాగం సీనియర్ వైద్యాధికారి డాక్టర్ పి.జగదీష్ పాల్గొని యాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కీళ్లవాతం, గ్యాస్ట్రిక్, శ్వాకోశ సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో కాంపౌండర్ జె.చంద్రశేఖరరావు, గాయత్రి, పి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆలయ మండపం ప్రారంభం

ప్రజాశక్తి- సోంపేట

మండలం కొర్లాంలో తారకేశ్వరాలయంలో నూతనంగా నిర్మించిన ఆలయ మండపాన్ని రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. మండపానికి అవసరమైన రూ.50 వేలు, టైల్స్‌ను విరాళంగా అందించడంతో ఆయనతో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు

మండపాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రానైట్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలం లింగాలవలస సమీపంలో గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న రావాడ అప్పారావు (44) శుక్రవారం ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. క్వారీలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు బౌల్డర్ మీద నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతుడిది కోటబొమ్మాలి మండలం రేగులపాడు. ఈ ఘటనపై సిఐ పైడియ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన హెల్మెట్‌ను ధరించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతి వాహనదారుడు నాణ్యమైన హెల్మెట్ ధరించాలని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆంధ్ర- ఒడిశా సరిహద్దు అమీన్ సాహెబ్ పేట వద్ద వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు నివారణకు నాణ్యమైన హెల్మెట్ ధరించడం వల్ల చాల వరకు ప్రమాదాలు నివారించవచ్చునన్నారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి శశిరేఖ

మండపల్లి అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలం మండపల్లి పంచాయతీలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని సర్పంచ్ పట్ట శశిరేఖ అన్నారు. మండపల్లిలో కుమ్మరి కుల సామాజిక భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భరత్ బెహరా, గ్రామపెద్దలు పాండుర పాత్రల వెంకటేష్, ధర్మాన వెంకటరావు, తుంబ బెహరా, ఉమాకాంత్ బెహరా, ఢిల్లీ బెహరా, పాతర్ల దమయంతి పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం కల్పించిన ఓటుహక్కును అభివృద్ధి కోసం వజ్రాయుధంగా ఉపయోగించు కోవాలని, ఓటు మన జన్మ హక్కుని, ఓటుహక్కుతో అభివృద్ధిని సాధించుకోవాలని ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు సూచించారు. శుక్రవారం ఎంఎంఎస్ కార్యాలయంలో మహిళలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఎం బి.మల్లేశ్వరరావు, రైతు ఉత్పత్తి సంఘాల ఎపిఎం అప్పల నరసమ్మ, సమాఖ్య ఉపాధ్యక్షులు సుగుణమ్మ, కోశాధికారి వరలక్ష్మి, సిసిలు రేణుక, నాగమ్మ పాల్గొన్నారు.

రేపు క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఎస్‌పి కప్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకోవాలని ఎస్ఐ సిహెచ్ రామారావు కోరారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి జి.ఆర్. రాధిక ఆదేశాల మేరకు 10న ఎస్‌పి కప్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నా మని తెలిపారు. రెండు రోజుల పాటు మండల స్థాయిలో టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వాలీబాల్, క్రికెట్ క్రీడలు నిర్వహిస్తామని, గెలిపొందిన జట్లుకు 12న ఎస్‌పి చేతులమీదగా బహుమతులు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాల కు 63099 90858 ను సంప్రదించాలని కోరారు.

'టిపిడబ్ల్యు' కమిటీ నియామకం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

టిడిపి అనుబంధ విభాగం తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ నియోజకవర్గ కమిటీని ఎమ్మెల్యే అశోక్ ప్రకటించారు. కంచిలి మండలానికి సంబంధించి అధ్యక్షుడిగా సిద్ధార్థ మల్లలి, నియోజకవర్గ అధ్యక్షుడిగా మున్సిపాలిటీకి చెందిన పైల నారాయణరావు, కవిటి మండలానికి చెందిన సనపల శివకష్ణ, కంచిలి మండలానికి చెందిన బొడ్డ కిరణ్ కుమార్‌ను ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. వీరి నియామకం పట్ల టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిపిడబ్ల్యు పార్లమెంట్ అధ్యక్షుడు వూన సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌కు రాజపురం నుంచి వేస్తున్న 33 కెవి లైన్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి కవిటి టౌన్ లైన్ మైంటినెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో కవిటి, కొత్తూరు, గొండ్యాల పుట్టుగ, ప్రగడ పుట్టుగ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పెద్దరెల్లివీధిలో కార్డాన్ సెర్చ్

శ్రీకాకుళం : నగరంలోని పెద్దరెల్లి వీధిలో రెండో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యాన ఇంటింటా కార్డాన్ చర్చ్ శుక్రవారం నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు గాని, ఇళ్ల వద్ద పరిచయం లేని వ్యక్తులు గాని సంచరిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. వాహనాల రిజిస్ట్రేషన్లు, వాహనదారులు గుర్తించి సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అద్దెలు కోసం వచ్చినా, అనుమానస్పదంగా అనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. దొంగతనాలు, దోపిడీలు, హత్యలు ఇటువంటి అరాచక శక్తులు సంచరించడంతో ఈ కార్డాన్ సెర్చ్ ద్వారా వారి సమాచారాన్ని తెలుకోవడానికి వీలుంటుందన్నారు. అందువల్ల ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ హరికృష్ణ, కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి

మెళియాపుట్టి: పదో తరగతిలో శాతం ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని పద్మావతి యూనివర్సిటీ ప్రొఫెసర్ పత్రీ తులసి అన్నారు. శుక్రవారం పెద్దమడి ఎపిజిటిడబ్ల్యుహెచ్ బాలురలో నిర్వహించిన 10వ తరగతి విద్యార్థులకు ఆత్మస్థైర్యం కలిగించారు. ఎంఇఒ మల్లారెడ్డి పద్మనాభరావు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు పరీక్షలో మెళకువలు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వైకుంఠరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.